క్లుప్తంగా

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి (ఫైల్)

ధర్మసాగర్: అప్పుల బాధ, భార్య క్యాన్సర్‌తో మృతిచెందడంతో మనోవేదనకు గురైన వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన చల్లా దేవేందర్‌రెడ్డి (55) అప్పులు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదిస్తున్నాడు. అయితే అతని భార్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గత మూడు సంవత్సరాల క్రితం మృతి చెందింది. ఈ క్రమంలో దేవేందర్‌రెడ్డి చేసిన అప్పులు తీర్చలేక మద్యానికి బానిసై తరుచూ భార్యను గుర్తుచేసుకుంటూ మనోవేదనకు లోనయ్యేవాడు. కాగా గురువారం సాయంత్రం బావి వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కలవారు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

విద్యుత్ తీగలు చోరీ

కమలాపూర్: వ్యవసాయ బోరుమోటార్ల వద్ద ఉన్న విద్యుత్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన మండలంలోని ఉప్పల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామ శివారులోని వ్యవసాయ, బోరు బావుల వద్ద 10 మంది రైతులు విద్యుత్ మోటార్లు అమర్చుకున్నారు. విద్యుత్ మోటర్లకు అమర్చుకున్న సుమారు 150 మీటర్ల విద్యుత్ తీగను గుర్తు తెలియని దుండగులు కత్తించి అపహరించినట్లు తెలిపారు. అపహరించిన విద్యుత్ వైరును సమీపంలోనే నిప్పుపెట్టి అందులోని కాపర్ వైరును తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో తమకు సుమారు రూ. 20 వేల వరకు నష్టం వాటిల్లిందని, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక..



దామెర: టార్గెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు మండల కేంద్రంలోని శ్రీహర్ష పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్లు శివానంద్, వెంకటరాజు శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన టి. యోగేశ్వర్, టి. మల్లికార్జున్, కె. రాజేయ్‌కుమార్, ఎస్. సిద్ధూ, ఎన్. శ్రీతవీష్‌చందర్, బి.రాక్విత్, పి. సాయిచరణ్, ఎస్. ప్రజ్వల్‌రాజ్, బి. చరణ్, ఎస్. విజయ్‌కృష్ణ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. కాగా ఈ నెల 26, 27 వ తేదీల్లో నర్సంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ రమేష్, పాఠశాల యాజమాన్యం శివానంద్, వెంకటరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

కమిటీ ఎన్నిక

ఎల్కతుర్తి: మండల కేంద్రంలో వడ్డెర సంఘం మండల యూత్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్‌కమిటీ అధ్యక్షుడిగా సూర సాంబరాజు, ఉపాధ్యక్షుడిగా బొంత రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా ఆలకుంట రాజు, సహాయ కార్యదర్శిగా గండికోట పరమేష్, కోశాధికారిగా వల్లెపు శ్రీకాంత్, అధికార ప్రతినిధిగా కస్తూరి అంజి, సలహాదారుడిగా గండికోట సాంబరాజు, కార్యవర్గ సభ్యులుగా ఆలకుంట లక్ష్మణ్, సూర హరికృష్ణ, గుర్రపు సతీష్, గండికోట రంజీత్, గొల్లన రాజు, అంజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

కిట్‌ల పంపిణీ

శాయంపేట : ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన కిట్లను మండలంలోని బీఎల్‌ఓలకు డిప్యూటీ తహసీల్దార్ జంగా లక్ష్మీనారాయణ శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలకు కిట్ల వినియోగంపై శనివారం, ఆదివారం స్పెషల్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఓటరు నమోదు చేసుకోనివారు తమ గ్రామాల్లోని బీఎల్‌ఓల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు శరత్‌కుమార్, హుస్సేన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన భూపాలపల్లి మండలం మోరంచపల్లి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన భవాని, శ్రీకాంత్ భూపాలపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మోరంచపల్లి-కుందయ్యపల్లి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న టాటా ఏసీ వాహనం ఢీ కొట్టింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమయంలో అటుగా వెళ్తున్న చిట్యాల ఎస్సై షాఖాన్ గమనించారు. వెంటనే వారికి పోలీస్ వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

● ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు



పరకాల : శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం వేడుకలలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

పరకాల: పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి వ్రతం పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య, యువజన సంఘాల నాయకులు ఎల్లంకి వీరేశం, సూర్యదేవర సదానందం, శ్రీరాం రవీందర్, శ్రవణ్, లక్ష్మణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీ మత్స్యగిరిస్వామి, శ్రీ వెంకటేశ్వర, శ్రీశివమార్కండేయ స్వామి ఆలయాల్లో రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సాముహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, మార్త రాజ్‌కుమార్ లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట గణపతి పూజ, శ్రీ మహాలక్ష్మీ అష్టోత్తరం, పసుపు, కుంకుమతో కలశారాధన చేసి పూజలు ప్రారంభించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, పాడిపంటలు పండాలని మహిళలు వేడుకున్నారు. ప్రతీ ఇంటా ధనలక్ష్మీ రావాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యగిరిస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, మహిళలు పాల్గొన్నారు.



శాయంపేట : మత్స్యగిరి స్వామి ఆలయంలో పాల్గొన్న మహిళలు



పరకాల: చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పరకాలలో బీజేపీ జెండా ఎగరాలి



పరకాల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవింద్ బెల్లద



శాయంపేట : ఉల్లాస్ యశ్వంత్ తుయోంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పరకాల: రాబోయే ఎన్నికలలో పరకాల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని ధార్వాడ్ హుబ్లీ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే అరవింద్ బెల్లద పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కామారెడ్డిపల్లిలో శ్రీకొమురవెల్లి మల్లిఖార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ఎన్నికల్లో విజయం సాధించేందుకు పలు సూచనలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర నాయకులు గుజ్జ సత్యనారాయణరావు, కాచం గురుప్రసాద్, మేఘనాథ్, అసెంబ్లీ కన్వీనర్ ముల్క ప్రసాద్, మండల ఇన్‌చార్జ్ రామన్న తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో గెలిచి పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని గోవా నవెలిం బీజేపీ ఎమ్మెల్యే ఉల్లాస్ యశ్వంత్ తుయోంకర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్వీకెకె ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశానికి బీజేవైఎం జిల్లా నాయకుడు రవికిరణ్ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను బూత్ స్థాయి నుంచి 25 సంవత్సరాలుగా బీజేపీ పార్టీలో పని చేసి ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో బూత్ స్థాయి కార్యకర్తలు సమీష్టిగా పనిచేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి వివరించాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ, నాయకులు వనం నిర్మలదేవరాజు, ఉప్పు రాజు, కానుగుల నాగరాజు, సత్యనారాయణ, రమణారెడ్డి, స్వరూప, రమాదేవి, మల్లారెడ్డి, శివ, సురేష్, చంద్రమౌళి, సుమన్, నవీన్, భాస్కర్‌రెడ్డి, కాజాపాషా, సాంబయ్య, దేవ్‌సింగ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాజు

శాయంపేట : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలురు గురుకుల పాఠశాల, గోవిందాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 8 ఏళ్లుగా పదోన్నతులు కల్పించలేదని, హైకోర్టు స్టేను వేకెట్ చేయించి బదిలీలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు టైంస్కేల్, ఇవ్వాలని, పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ఇవ్వాలని అన్నారు. సమస్యల పరిష్కారంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు చంద్రయ్య, చైతన్య, మండల నాయకులు భాస్కర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో లైబ్రరీలు అవసరమే

కేయూ క్యాంపస్: డిజిటల్ యుగంలోనూ లైబ్రరీలు కూడా ఎంతో అవసరం అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. క్యాంపస్‌లో లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన లైబ్రరీ సైన్స్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వీసీ మాట్లాడారు. ఎంఎల్ఐఎస్సీ కోర్సులో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థి టి.మౌనికకు వెంపాటి లక్ష్మీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ తరఫున విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ కోలాహలం రామ్‌కిషోర్ రూ.10వేల నగదు బహుమతిని వీసీ రమేష్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే, ఇటీవల మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ నుంచి ఉత్తమ అధ్యాపకురాలిగా అవార్డు అందుకున్న లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణిని వీసీ అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కృష్ణమాచార్యులు, డాక్టర్ అంజయ్య, డాక్టర్ జయరాంరెడ్డి పాల్గొన్నారు.



మౌనికకు బహుమతి అందజేస్తున్న వీసీ, తదితరులు

హరితహారాన్ని విజయవంతం చేయాలి



స్థలం పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

దామెర: హరిహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కాగితాల శంకర్ కోరారు. మండల కేంద్రంలో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాన్ని అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించి, గుంతలు తవ్వించారు. లక్ష వృక్షార్చన కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ రవీందర్, ఏపీఓ శారద, టీఏ సురేందర్, కారోబార్ మాదారపు బొబ్బిలి, ఫీల్డ్ అసిస్టెంట్ సారంగం తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఐనవోలు: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన పిడుగు కొమురమ్మ ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ కడియం శ్రీహరి నిర్వహించిన సభకు వెళ్లి రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కొమురమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు గబ్బెట రాజయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



ఆత్మకూరు: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి మంజుల అన్నారు. మండలంలోని తిరుమలగిరి కేజీబీవీలోని విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వాసవి, ఉపాధ్యాయులు రమాదేవి, స్వప్న, హబీబా, శైలజ, వాసవి తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవానికి తరలాలి..

కమలాపూర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నేడు (శనివారం) మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే వజ్రోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పల్లవి శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని తెలిపారు. అందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో వెయ్యి మొక్కల చొప్పున నాటేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో 500 మంది బాలికలతో పాఠశాల ఆవరణలో వినూత్నంగా మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అనంతరం అన్ని ప్రభుత్వ శాఖల్లోని మహిళా అధికారులు, మహిళా ప్రజాప్రతినిధులు, స్వశక్తి సంఘాల మహిళలతో కలిసి ఎంపీపీ, జెడ్పీటీసీ గుండేడులోని శివాలయం ఆవరణలో మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు.

పోచమ్మవిగ్రహ పునఃప్రతిష్ఠాపన



వల్భాపూర్‌లో నిర్వహించిన హోమంలో పాల్గొన్న సర్పంచ్ దంపతులు

ఎల్కతుర్తి: మండలంలోని వల్భాపూర్‌లో పోచమ్మతల్లి పునఃప్రతిష్ఠాపన పూజా మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభించినట్లు సర్పంచ్ అంబాల మమత ప్రతాప్ తెలిపారు. మొదటిరోజు నాందిధ్వజముతో గంగపూజ, కుంభ జలసేరణ, దేవాలయ ప్రవేశం, నాందిధ్వజారోహణం, అఖండ దీపారాధన, గణపతి పూజా, పుణ్యాహవచనం, వీర మహేశ్వర రుత్విక్ వర్ణము, పంటప సూత్ర రక్షాబంధనము, జగద్గురు పంచాచార్యకల్ప సహిత కుంభ కలశ స్థాపనం, తదుపరి మూలమంత్ర జపము, అగ్ని స్థాపనంతో పాటు విగ్రహాల ఊరేగింపు, జలాదివాసం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

రెన్యూవల్ ఫీజు రద్దు చేసి కమీషన్ పెంచాలి



పరకాల : డీటీకి వినతిపత్రం అందజేస్తున్న మీ సేవ నిర్వాహకులు



శాయంపేట : డీటీకి వినతిపత్రం అందజేస్తున్న మీ సేవ నిర్వాహకులు

పరకాల: రెన్యూవల్ ఫీజు రద్దు చేసి కమీషన్ పెంచాలని కోరుతూ మండలంలోని మీ సేవ నిర్వహకులు డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రకాశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పల్నాటి రాజేందర్, వేముల రాజేందర్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కమీషన్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సర్వీసులను పెంచి, హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, ఉచిత విద్యుత్ అందించి, సాంకేతిక పరమైన సమస్యలను పరిష్కరించేందుకు టెక్నికల్ టీం ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా మీ సేవ కేంద్రాలకు ప్రభుత్వ కార్యాలయాల్లో గదులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారగోని రమేష్, గౌరు వెంకట్‌రెడ్డి, పుల్లూరి సునీల్, సామల రంజిత్ పాల్గొన్నారు.

శాయంపేట : తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మీ సేవ నిర్వాహకులు శుక్రవాకం డిప్యూటీ తహసీల్దార్ జంగా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అసోసియేషన్ నాయకుడు మామిడి ప్రమోద్ మాట్లాడుతూ 2011 సంవత్సరం నుంచి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. మీ సేవ సేవలను పునరుద్ధరించి కమీషన్ పెంచాలని కోరారు. వార్షిక ఎంఎంసీ పేమెంట్ రద్దుచేసి విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం ఉచితంగా కల్పించాలని కోరారు. అలాగే నిర్వాహకులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని వారు వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాలికె రవీందర్, మీనాచారి, శివ, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు వెసులుబాటు కల్పించాలి

ఐనవోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తుల ప్రక్రియను మూడు రోజుల్లో ముగించడంతో అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ తెలిపారు. ఈ మేరకు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని స్థానిక తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. అలాగే పేదలకు అందించాల్సిన సన్నబియ్యాన్ని కొంత మంది రేషన్ డీలర్లు దొడ్డుబియ్యం ఇస్తున్నారని, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి చర్య తీసుకోవాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మార్నేని వెంకటేశ్వర్‌రావు, జిల్లా నాయకుడు రాయపురం సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కూస చిరంజీవిరెడ్డి, తాళ్లపెల్లి వెంకటనారాయణ, సునీల్, సమ్మెట రాజు, రహీమ్, రవి, సాంబయ్య, స్వామి, ప్రతాప్, భాస్కర్, మల్లేశం, సారయ్య, సాయి, వెంకన్న, రహీంఖాన్, రమేష్, కుమారస్వామి, బాబు, హరీష్, భరత్, శ్రీకాంత్, రాజు, రాజారాం, ఆనందం, రాజయ్య, కొమురయ్య, బాబు, రసూల్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గులాబీరంగు పురుగులను నివారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజు

దామెర: పత్తి పంటను నాశనం చేసే గులాబీరంగు పురుగుల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రాజు అన్నారు. మండల కేంద్రంలో జగృతి ప్రాజెక్టు, బాయిర్‌క్రాప్ సైన్స్ కంపెనీ, ఎల్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో గులాబీ పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా లింగాకర్షణ బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పత్తిచేనులో పేనుబంక సోకుతుందని, దాని నివారణకు ఏసీపేట్ 0.2 గ్రాములు లేదా 1.5 గ్రాముల ఏసీటామిడ్, 0.2 మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా గింజలు విత్తిన 45 రోజుల్లో గులాబీరంగు పురుగు ఆశించే అవకాశం ఉందని, వీటి నివారణకు లింగాకర్షన బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పంట రక్షణకు రైతులు మెలకువలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాయిర్ క్రాప్‌కంపెనీ రీజనల్ మేనేజర్ రాజశేఖర్, సీనియర్ అగ్రానమిస్ట్ గంగాధర్, మేనేజర్ లక్ష్మీనారాయణ, అఖిలేష్, పూర్ణ, సాంబయ్య, నాగరాజు, రాజయ్య, మధుసూధన్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ల కోసం దరఖాస్తులు

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి హనుమకొండలోని కొత్తూరు ప్రాంతానికి చెందిన బొమ్మతి విక్రమ్ దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అడ్మిన్ అల్లం భాస్కర్‌కు శుక్రవారం దరఖాస్తు సమర్పించారు. విక్రమ్ బీటెక్, ఎల్ఎల్‌బీ పూర్తి చేసి ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో వివిధ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఓబీసీ విభాగం జిల్లా చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

పరకాల: కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇనగాల వెంకట్రామిరెడ్డికు పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం గాంధీ భవన్‌కు చేరుకున్న పీసీసీ కోఆర్డినేటర్ బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, జిల్లా నాయకులు చాడ కొంరారెడ్డి, కొండేటి కొంరారెడ్డి, నాలుబోల కిష్టయ్య, సంగెం, ఆత్మకూరు మండల అధ్యక్షులు చోల్లేటి మాదవ రెడ్డి కమలాపురం రమేష్, పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్‌లు ఇనగాల వెంకట్రామిరెడ్డి తరపున దరఖాస్తు చేశారు.



కమలాపూర్ : దరఖాస్తు చేస్తున్న తౌటం రవీందర్

కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ తౌటం రవీందర్ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుక్రవారం దరఖాస్తు సమర్పించారు.

గుణపాఠం తప్పదు

శాయంపేట : త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మారెపల్లి కట్టయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధికి దూరంగా ఉంచారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు గెలుపు ఖాయమన్నారు.